## క్లుప్తంగా

### నేడు నేదురుమల్లి రాక

వెంకటగిరి: తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి సోమవారం వెంకటగిరి రానున్నట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి. సోమవారం ఉదయం 9గంటల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఆయన అందుబాటులో ఉంటారని పేర్కొన్నాయి.

### పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించండి



పట్టభద్రులను ఓట్లు అభ్యర్థిస్తున్న నేతలు

చిల్లకూరు: తూర్పు రాయలసీమ పట్టభద్రుల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కమ్మవారిపాళెం గ్రామంలో పట్టభద్రులను కలిసి కరపత్రాలను అందించి పేర్నాటిని గెలిపించాలని వారు కోరారు. నాయకులు మాట్లాడుతూ పేర్నాటికి తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నేతలు దువ్వూరు చంద్రారెడ్డి, సర్పంచ్ చిట్టేటి నారాయణ, మిల్టన్ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించండి

సైదాపురం: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీఅభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆశీర్వదించాలని మండల జేఎస్‌సీ కన్వీనర్ మన్నారపు రవికుమార్ ఓటర్లను అభ్యర్థించారు. సైదాపురంలో ఆదివారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. అలాగే 3న మండలంలోని చాగణం గ్రామంలో జరిగే వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### సత్ప్రవర్తన రావాలి



సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ

సైదాపురం: సత్ప్రవర్తన రావాలని ఎస్‌ఐ పి.నాగబాబు రౌడీషీటర్లను కోరారు. సైదాపురంలోని పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, అనుమానితులకు ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక నుంచి గ్రామాల్లో మీ కారణంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆయన కోరారు. నడవడిక మార్చుకుని సమాజంలో మంచిపేరును తీసుకురావాలని కోరారు.

### ఫలసరుకుల పంపిణీ



ఫల సరుకులు అందజేస్తున్న దాత

గూడూరు: మల్లికార్జునరెడ్డి దాతృత్వంతో ఆదివారం పేదలకు ఫల సరుకులు పంపిణీ చేశారు. పట్టణ సమీపంలోని గాంధీనగర్‌లోని ఎస్టీ కాలనీలోని పేదలకు బియ్యంతో పాటు నూనె, అన్ని రకాల పప్పులు ఇతర వస్తు సామగ్రిని అందజేశారు.

### వైజ్ఞానిక ప్రదర్శన నేడు

వెంకటగిరి: ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనను ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సోమవారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

### చెంగాళమ్మ సేవలో ద్వారకా తిరుమల ఈఓ



ద్వారకా తిరుమల ఆలయ ఈఓను సత్కరిస్తున్న చెంగాళమ్మ ఆలయ ఈఓ

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ జాయింట్ కమిషనర్, ఈఓ వి.త్రినాథరావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. వారు ఆలయానికి విచ్చేయగానే ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఘనంగా స్వాగతం పలికి సాదరంగా ఆలయంలోకి ఆహ్వానించారు. అనంతరం అమ్మవారి వద్ద వారికి ప్రత్యేక పూజలు చేయించి వేదపండితుల ఆశీర్వచనాలతో ఆలయ మర్యాదలతో వారిని సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

పార్థివదేహాలకు అంత్యక్రియలు జరిపే దహనశాల



పార్థివదేహాలను తరలించేందుకు వినియోగించే వైకుంఠ రథాలు



వితంతువు కార్యక్రమాల భవనం



# స్వర్గధామం!

- భూతల స్వర్గాన్ని తలపిస్తున్న నాయుడుపేట హిందూ శ్మశానవాటిక
- ప్రజాప్రతినిధులు, దాతల సహకారంతో అన్ని వసతులు



స్వర్గధామం వద్ద ఏర్పాటు చేసిన ప్రధాన ముఖ ద్వారం

నాయుడుపేటటౌన్: పట్టణంలోని స్వర్ణముఖి నది తీరాన ఉన్న హిందూ శ్మశానవాటికలో 11 ఏళ్ల కిందట పిచ్చిమొక్కలతో భయానక వాతవరణాన్ని తలపించేది. రెండు ఏకరాల యాభై సెంట్ల స్థలంలో శ్మశానవాటికను స్వర్గధామంగా మార్చి భూతల స్వర్గంగా తీర్చిదిదేందుకు పట్టణంలోని అనేకమంది పెద్దలు, ప్రముఖులు, నాయకులు, విశ్రాంతి ఉద్యోగులు ఏకతాటిపై నిలిచారు. దాంతో హిందూధర్మ సేవాసంఘంగా ఏర్పాటై స్వర్గధామానికి మరింత శోభ తీసుకొచ్చేలా శ్మశానవాటికలో దాతలు, ప్రజాప్రతి నిధుల సహకారంతో అధునాతన హంగులతో అన్ని వసతులు కల్పిస్తూ స్వర్గధామం రూపుదిద్దుకుంది. హిందూధర్మ సేవా సంఘ ఆధ్వర్యంలో 2013లో స్వర్గధామాన్ని ప్రారంభించారు. పలువురు దాతలు సైతం స్వర్గధామం అభివృద్ధికి చేయూత అందించారు. స్వర్గధామానికి పార్థివదేహాలను దుఃఖసాగరంలో ఉంటూ శ్మశానవాటికకు వచ్చిన వారికి ఎంతో ఆహ్లాదం కలిగించేలా ఇక్కడి వాతవారణం ఉంటుంది. స్వర్గధామంలో ఏర్పాటు చేసిన భవనాలు, విగ్రహాలు, ప్రతిదానిపై దాతలను పేర్లు రాయించారు. స్వర్ణముఖి నది సమీపం నుంచి స్వర్గధామం వరకు రోడ్డు దుస్థితిపై హిందూ ధర్మ సేవా సంఘం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి రూ.25 లక్షలకు పైగా నిధులు మంజూరు చేయించి సిమెంట్ రోడ్డు వేయించారు. స్వర్గధామం అభివృద్ధికి దాతల సహకారంతో ఎంతో కృషిచేస్తున్న హిందూ ధర్మసేవా సంఘానికి చెందిన నేతలు కామిరెడ్డి రాజారెడ్డి, కలికి మాధవరెడ్డి, కందనూరు బాపూజీరావు, చిరువేళ్ల మునిరాజా, దువ్వూరు సుబ్రహ్మణ్యంరెడ్డి, ప్రళయకావేరి ఉదయశంకర్, మునగాల కృష్ణారావు, కంకిపాటి పాండు రంగయ్య, నైనప్పగారి కుమార్,ఆకుల కుబేరు మణి, గంధవళ్లి సిద్దయ్య, చిట్టేటి అంకయ్య, మదిరి జలంధర్, శిరసనంబేటి గోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దోర్నాదుల యతేంద్ర సంఘ సభ్యులు ప్రసంసలు అందుకుంటున్నారు.

**దాతల సహకారంతో భవనాలు...**

హిందూ శ్మశానవాటికలో దాతల సహకారంతో పలు భవనాలను నిర్మాణం చేపట్టారు. కర్మక్రియలు జరుపుకునేందుకు భవనం, నిరాశ్రయుల భవనం, వాహనాలు పెట్టుకునేందుకు షెడ్డు, వాచ్‌మెన్ నివాస భవనం, హిందూ ధర్మసేవా సంఘ భవనం, అస్తికలు భద్రపరుచుకునే లాకర్, సందర్శకుల భవనం, స్వర్గరోహణ పేరిట రెండు దహనశాలల్లో నాలుగు దహన పేటికలు, శీతలశవపేటికలను భద్రపరుచుకునేందుకు వసతి భవనం, ఏడు శీతల శవపేటికలతో పాటు మృతదేహాన్ని కూర్చపెట్టుకునే శవపేటిక, క్షుర కర్మశాల భవనం, వితంతు కార్యక్రమాల భవనం, స్నానపు గదులు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణాలు చేశారు.

**కరోనా కాలంలో విశేష సేవలు..**



కరోనా కష్టకాలంలో నాయుడుపేట హిందు సేవా సంఘ నాయకులందరం సమష్టిగా విశేష సేవలు అందించాం. కరోనాతో మృతి చెందిన వారి అంత్యక్రియలు చేసేందుకు నాయుడుపేట హిందూ శ్మశానవాటికలో అనుమతితో ప్రత్యేక శ్మశాన స్థలం ఏర్పాటు చేసి అంత్యక్రియలు చేసేందుకు ముందుకు వచ్చి ఆదర్శంగా నిలిచాం. – కామిరెడ్డి రాజారెడ్డి, హిందూధర్మ సేవా సంఘ కన్వీనర్, నాయుడుపేట

**స్వర్గధామం కోసం ఏకతాటిపై నిలిచారు**



నాయుడుపేటలో హిందూ ధర్మ సేవాసంఘ సారథ్యంలో అందరు ఏకతాటిపై నిలిచి స్వర్గధామంను ఎంతో అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నారు. దాతలు ఇచ్చిన విరాళాలను సక్రమంగా వినియోగిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. అనాథ మృతదేహాలను మున్సిపల్ సిబ్బందితో ఖననం చేయిస్తున్నాం. – కటకం దీపిక, మున్సిపల్ చైర్‌పర్సన్, నాయుడుపేట

**కులమతాలకు అతీతంగా సేవలు..**



కులమతాలకు అతీతంగా ఎవరు మృతిచెందినా శీతల శవపేటికలతో పాటు మృతదేహాలను తరలించేందుకు వాహనాలను సంఘం నిర్ణయించిన ధరలకు అందిస్తున్నారు. మానవత్వాన్ని చాటుకునేలా హిందు సేవా సంఘ తరపున సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. – చిందేటి వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘ నాయకులు, నాయుడుపేట

**అన్ని వసతులు కల్పిస్తున్నాం..**

స్వర్గధామంలో (హిందూ శ్మశానవాటిక)లో అంత్యక్రియలు నిర్వహించేందుకు అన్ని వసతులను కల్పిస్తున్నాం. అనాథ మృతదేహాలకు ఉచితంగా అంత్యక్రియలు జరుపుతున్నాం. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, తిరుపతి ఎంపీ గురుమూర్తి పలువురు దాతల సహాయం చేయాలని వినతులను అందించాం. – హిందూ ధర్మ సేవా సంఘ నేతలు

## మద్దతుధరలు పెంచాలి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

పెళ్లకూరు: వ్యవసాయంపై పెట్టుబడులు పెరుగుతున్న తరుణంలో పంటల మద్దతు ధరలను పెంచాలని సూళ్లూరుపేట డివిజన్ రైతు సంఘాల సమాఖ్య కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం పునబాక గ్రామంలో జరిగిన రైతు సంఘాల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ఎకరం వరి సాగు చేయడానికి రూ.52వేలు ఖర్చు అవుతుందని అందువల్ల స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు యాభై శాతం రైతులకు ఆదాయం చేకూరేలా మద్దతు ధర కల్పించాలన్నారు. ఒక క్వింటాల్ వరి ధాన్యానికి రూ.3,500 చొప్పున మద్దతు ధర కల్పించాలని కోరారు. ఈమేరకు డివిజన్ రైతు సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో చేసిన తీర్మానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తున్నట్లు చెప్పారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాదంలో గాయపడ్డ వెంకటయ్య

చిల్లకూరు: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలో ఆదివారం వేకువజామున చోటుచేసుకుంది. కోట క్రాస్ రోడ్డు ప్రాంతంలోని నక్కల కాలువ కండ్రిగకు చెందిన వెంకటయ్య అనే గిరిజనుడు ముగ్గుపిండి అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో అతను ఆదివారం వేకువజామున మూడు చక్రాల బండిలో ముగ్గుపిండి తీసుకుని గూడూరు వైపు బయలుదేరాడు. చెన్నై నుంచి వెళుతున్న గుర్తుతెలియని వాహనం మూడు చక్రాల బండిని ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. గాయపడ్డ అతన్ని స్థానికులు గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసి అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులకు ఎలాంటి సమాచరం అందలేదన్నారు.

## విద్యార్థుల్లో ప్రతిభ పెంపొందాలి



విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ప్రిన్స్‌పల్

వెంకటగిరి: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనునిత్యం తమలోని ప్రతిభను పెంపొందించుకునేలా కృషిచేయాలని వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్స్‌పల్ డాక్టర్ రవీంద్రబాబు తెలిపారు. స్థానిక ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ పరీక్షలో ప్రతిభ చాటిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థి ఏ జాషువాకు ప్రథమ బహుమతిగా రూ.2,500 ద్వితీయ బహుమతి అదే పాఠశాలకు చెందిన ఎస్‌కే ఖదిర్‌కు రూ.1,500, జెడ్పీ బాలిక ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.భవితకు తృతీయ బహుమతిగా రూ.1,000 నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికను అందజేశారు. తర్వాత స్థానాలు ప్రతిభ చాటిన విద్యార్థులకు ఒకొక్కరికి రూ.500 వంతున నగదు ప్రోత్సాహకాలు, జ్ఞాపికలను అందజేశారు. చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఏ.శివకుమార్, కార్యదర్శి ఏ.ప్రతాప్, వైస్ చైర్మన్ సి.కోటీశ్వరరావు, ట్రెజరర్ ఏ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ముత్యాలమ్మ జాతరపై సమీక్ష



వెండి చీర అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: మార్చి14 నుంచి నాలుగు రోజు పాటు తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో జరిగే జాతరకు సంబంధించి సమీక్ష ఈనెల 28న మంగళవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ నవీన్‌కుమార్ తెలిపారు. తూర్పుకనుపూరు దేవస్థానంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగే జాతర సమీక్షకు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

**ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు..**

ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వెండి చీరతో అలంకరణ చేశారు. ఆలయ ఆవరణలో భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

### కోడిపందేల స్థావరాలపై దాడులు



కోడిపందెం రాయుళ్ల అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ, సిబ్బంది

వెంకటగిరిరూరల్: గ్రామశివార్లలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై వెంకటగిరి ఎస్‌ఐ జిలానీ ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని మొగళ్లగుంట గ్రామ వ్యవసాయభూముల్లో కోడిపందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు తమ సిబ్బందితో దాడులు నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశారు. రెండు కోళ్లు, మూడు సెల్‌ఫోన్‌లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పోలీస్‌స్టేషన్‌ల తనిఖీ



తడ పోలీస్‌స్టేషన్‌లో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



సర్కిల్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తడ: తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం తడ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. వార్షికంగా జరిపే సాధారణ తనిఖీల్లో భాగంగా ఎస్పీ తడ స్టేషన్ తనిఖీ చేశారు. కొత్త జిల్లా ఏర్పడ్డ అనంతరం తొలిసారి తడకు వచ్చిన ఎస్పీకి సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వరరెడ్డి, తడ ఎస్‌ఐ శ్రీనివాసరెడ్డి స్టేషన్ సిబ్బందితో కలిసి సాదరస్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఎస్పీ స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పారిశ్రామిక వాడగా అభివృద్ధి చెందిన తడలో సీసీ కెమెరాల పనితీరును మెరుగు పరుచుకోవాల్సిన అవసరాన్ని సిబ్బందితో చర్చించారు. 2017లో ఏసీబీ డీఎస్పీగా ఉన్న సమయంలో తడకు వచ్చిన పరమేశ్వర్‌రెడ్డి ప్రస్తుతం తిరుపతి జిల్లా ఎస్పీగా రావడం విశేషం.

**సూళ్లూరుపేటలో..**

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లను తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఆయన పోలీస్‌స్టేషన్‌కు విచ్చేయగానే సీఐ వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం సూళ్లూరుపేట, శ్రీహరికోట, తడ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని గతంలో దర్యాప్తు చేసిన కేసుల్లో రికవరీ చేసిన వస్తువులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులన్నింటిని పరిశీలించారు. సర్కిల్ కార్యాలయం పరిధిలో పనితీరు బాగుందని, అయితే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంకా పనితీరును మెరుగుపరుచుకుని కేసుల విషయంలో కూడా జాగ్రత్తలు తీసుకుని రికవరీలు పెంచాలని చెప్పారు. కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, పి.రవిబాబు, జేపీ శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల పరిశీలన



ప్రతిభ కళాశాలలో ఆర్‌ఐఓ

సూళ్లూరుపేట: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్ష కేంద్రాల తనిఖీల్లో భాగంగా పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలను ఆదివారం ఉమ్మడి నెల్లూరు జిల్లా ఆర్‌ఐఓ టి. వరప్రసాదరావు తనిఖీ చేశారు. సోమవారం నుంచి ఉమ్మడి నెల్లూరుజిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రయివేట్ కళాశాలల్లో వసతులు ఉన్నాయా, లేవా అని కోణంలో తనిఖీలు నిర్వహించారు. ఆర్‌ఐఓతో పాటు హైపవర్ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాలు పలుచోట్ల తనిఖీలు నిర్వహించారు. చీఫ్ సూపరింటెండెంట్ రవికుమార్‌ను కలిసి ఎగ్జామినర్లుగా వచ్చినటువంటి అధ్యాపకులతో కూడా మాట్లాడి పలు సలహాలు, సూచనలు చేశారు.

# ఇంటింటికీ సుజలం

- పల్లెపల్లెకు జలజీవన్ మిషన్ ఫలాలు
- తీరనున్న సొంతింటి కొళాయిల కల
- నియోజకవర్గంలో రూ 68.99 కోట్లతో పనులు





మాటమడుగు గ్రామంలో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్, తీర్థంపాడు నక్కల కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

వెంకటగిరి: ప్రతి ఇంటికీ అవసరమైనంత, సురక్షితమైన తాగునీరు అందించాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు వెచ్చించి అమలుచేస్తున్న జలజీవన్ మిషన్ ఆధ్వర్యంలో పనులు వెంకటగిరి నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతున్నాయి. గతంలో గొంతు తడుపుకోవాలంటే బోరుబావుల వద్దకు పరుగులు.. వీధి కొళాయిల వద్ద గంటల తరబడి పడిగాపులు .. వాగు వంకల్లో చెలమల కోసం వెంపర్లాట.. ఇవీ పల్లెవాసులు పడిన కన్నీటి పాట్లు. ప్రభుత్వం చేపట్టిన జలజీవన్ మిషన్ ( జేజేఎం )తో పల్లెలో సైతం ప్రజల ముంగిళ్లకే సుజలం చేరువ అవుతోంది. నియోజకవర్గంలోని ప్రతిపల్లె గడపకూ మంచినీరు రానుండడంతో పల్లెవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మెట్టప్రాంతం అయిన వెంకటగిరి నియోజకవర్గంలో 70శాతం పల్లెలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నాయి. వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో సమ్మర్‌స్టోరేజ్ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు. మిగిలిన అన్ని గ్రామాలకు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, మినీ రక్షిత తాగునీటి పథకాల ద్వారానే గ్రామాలకు తాగునీరు అందిస్తున్నారు. పథకాల నిర్వహణ దారితప్పడంతో తాగునీటి కష్టాలు పరిష్కారం కోసం ప్రజలు అధికారుల చుట్టూ తిరిగేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జలజీవన్ మిషన్ ద్వారా పరిపూర్ణంగా పల్లెల దాహార్తిని తీర్చేందుకు అడుగులు పడ్డాయి. విడతల వారీగా గ్రామాల్లో సైతం ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేసేందుకు రూపకల్పన చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే తాగునీటి ఇబ్బందులు జఠిలంగా ఉన్న గ్రామాలను గుర్తించి పనులు ప్రారంభించారు. పథకం ద్వారా నూతన బోర్లు, పైప్‌లైన్లు, ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులు, జీఎస్‌ఎల్‌ఆర్ ట్యాంక్‌లు, ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇచ్చే పనులు చేపట్టారు.

**రూ. 68.99 కోట్లతో పనులు..**

నియోజకవర్గంలో తొలి, రెండోదశల్లో ఇప్పటికే రూ 68.99 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయి. నియోజకవర్గంలో వివిధ మండలాల్లో 60 గ్రామాల్లో 185 పనులు పూర్తయ్యాయి. మరి కొన్ని గ్రామాల్లో పనులు చివరిదశలో ఉండగా, ఇప్పటికీ మొదలు గానీ పనులను టెండర్లు ప్రక్రియ పూర్తి చేయించి పనులు ప్రారంభించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పనులు ముగియగానే ఇంటి ముంగిటకే మంచినీళ్లు రానున్నాయి. ఏడాదిన్నరలో పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం పనులు వేగవంతం చేస్తోంది. మెట్టప్రాంతం అయిన వెంకటగిరిలో తాగునీటి ఇబ్బందులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కావడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టింది.

**తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది**



మా గ్రామంలో జలజీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు నక్కల కాలనీలో ఓవర్‌హెడ్ ట్యాంక్ పనులు చేపట్టాం. గ్రామంలో కొత్తగా కొళాయి కనెక్షన్‌లు ఇచ్చి ప్రతి ఇంటికీ మంచినీటిని సరఫరా చేస్తున్నాం. గ్రామస్తులంతా సంతోషంగా ఉన్నారు. – పి జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచ్, తీర్థంపాడు

**మంచినీటి కష్టాలు తీరనున్నాయి ...**



మా గ్రామంలో 400కు పైగా ఇళ్లు ఉన్నాయి. జలజీవన్ మిషన్ కింద ఇళ్లకు కొళాయిలు ఏర్పాటు చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పనులు పూర్తయితే గ్రామస్తులు తాగునీటి కష్టాలు పూర్తిగా తీరిపోతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏళ్ల తరబడి నెలకొన్న నీటి కష్టాలు తీరాయి. – పాడి ధనంజయ, దగ్గవోలు